55

# ఇంటికన్నా వీధి పదిలం

అసలే కోతి. కల్లు తాగింది. తేలు కుట్టింది.

అప్పుడెలా ఉంటుంది?

అచ్చం అలానే ఉంది వరాలమ్మ అనబడే వరలక్ష్మమ్మ పరిస్థితి.

వరాలమ్మకి బి.పి ఉంది. పది రోజుల్నుంచీ పని మనిషి రావడం మానుకుంది. ఆ పని భారంగా ఉంది. వంట ఆలస్యంగా అయినందుకు భర్త చిర్రుబుర్రులాడుతూ ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అందుకు బాధగా ఉంది.

నాలుగేళ్లనుంచీ నిరుద్యోగిగా ఉన్న ముద్దుల కొడుకు వంద రూపాయలు- ముష్టి వంద రూపాయలు అడిగితే ఇవ్వలేక పోయింది. తన దగ్గర లేక కాదు. చెడు స్నేహాలు పట్టి చెడిపోతున్నాడని తెలిసి. అందుకు దిగులుగా ఉంది.

వెరసి ఇవన్నీ బి.పి గా పరిణమించి ఒంటి కాలి మీద లేచి ఆడుతోంది ఆ ఇల్లాలు. వంట గదిలో కాలికి తగిలిన వస్తువునల్లా తన్ని తగిలేస్తోంది.

అదిగో - సరిగ్గా అదే సమయంలో వీధిలో గేటు ముందునుంచి వినిపించింది.

"అమ్మా! ఆకలమ్మా! గుప్పెడు మెతుకులెయ్యండమ్మా!"

ఆ శబ్దం వినగానే తోక తొక్కిన తాచులా లేచిపోయింది వరాలమ్మ. లేచి గేటు వైపు పరుగెత్తింది.

"ఏమే మీ ఆకలికి వేళా పాళా లేదా?" అని విరుచుకు పడింది. "అడ్డగాడిదలా వున్నావు. పన్జేసుకు బతకలేవూ?"

అడుక్కోటమే వృత్తిగా పెట్టుకున్న ఆ ముష్టిపిల్లకి ఇలాంటి దూషణ, భూషణ, తిరస్కారాలు అతి మామూలు. అందుకే అతి తీరిగ్గా, తేలిగ్గా-

"ఆకలికి యేలేంటి అమ్మగోరూ. మాకు యేలపాటున తిండుంటదా యేలపాటున ఆకలెయ్యటానికి?" అంది.

"మాటలు నేర్చిన కుక్క ఇస్కో అంటే ఇస్కో అందిట. అంతలేసి మాటలు నేర్చిన దానివి అలా ముష్టెత్తుకోకపోతే కష్టపడి పన్జేసుకు బతకరాదూ?"

అదుగో, మళ్ళీ అదే మాట. ఎన్ని తిట్లు తిట్టినా ఫర్వాలేదు గాని, ఆ పాడు మాటంటేనే కోపం వస్తుంది. అయినా తన కోపానికి విలు నెక్కడిది? పేదదాని కోపం పెదవికి చేటు.

"పన్జెప్పే దాతలుంటే ఈ పాడు పనెందుకమ్మా!"

"నువు చెయ్యాలనుకుంటే పనే దొరకదా?"

"లేదమ్మా. నిజంగానే ఎవరూ పన్జెప్పటంలేదు. పోనీ, తఁవరే ఏదన్నా పన్జెప్పి నాకింత తిండి పడెయ్యండమ్మా!" అంది.

ఆ ఇల్లాలి నోటి ధాటిని ఎదుర్కోవాలని ఆ ముష్టిపిల్ల ఆ మాటలన్నా అవి వరాలమ్మ పట్ల వరంగా పరిణమించాయి. ఆమెలో ప్రలోభం తలెత్తింది. పది రోజులుగా పని మనిషి రావటం మానుకుంది. వచ్చినా వారానికి రెండ్రోజులైనా ఎగనామం పెడుతుంది. పైగా రెండు నెలల అడ్వాన్సు. ముందుగానే పట్టుకు పోయింది. దీన్ని ఇంట్లో పెట్టుకుంటే ఇలాంటి ఈతిబాధలన్నీ తప్పుతాయి గదా! ఏదో నాలుగు మెతుకులు పడేస్తే కుక్కలా ఇంటి ముందు పడుంటుంది. అనుకుని-

"నిజంగా పన్జేస్తావా?" అనడిగింది.

"నిజంగానే అమ్మగారూ!"

"అయితే నువ్వు ఇక్కడే పడుండాలి. ఎక్కడికీ వెళ్లకూడదు."

"నే నెక్కడి కెళ్తానమ్మా? ఇల్లా, వాకిలా?"

"నీ కడుపుకు కావల్సినంత తిండి పెడ్తాను. డబ్బు మాత్రం ఒక్క పైసా కూడా ఇవ్వను, తెలిసిందా?"

"అలాగే నండమ్మా! కడుపు నిండా బువ్వుంటే నాకు పైసల్తో పనేంటండమ్మగారూ. ఏదో ఒల్లు కప్పుకోటానికి కాత్తంత పాతగుడ్డ పారెయ్యండి. అంతేసాలు."

మరింక ఆలోచించలేదు వరాలమ్మ. భలే మంచి చౌక బేరం ఆలసించిన మరింక లభించదని భయపడింది. వెంటనే లోపలికి పిలుచుకెళ్ళింది. రాత్రి మిగిలిన అన్నం పెట్టింది. కడిగినవీ, కడగనివీ, కడగాల్సినవీ, కడగకూడనివీ అన్నీ బయట పారేసి కడిగించింది.

"ఆ స్టోర్ రూం శుభ్రం చేసుకో. రాత్రికి అక్కడే పడుకుందువు గాని" అని చెప్పి మళ్ళీ "నా మతి మండ మర్చేపోయాను అడగటం ... ఇంతకీ నీ పేరేవిటే?" అనడిగింది.

"పాపమ్మ అంటారండి"

పాపిష్టి ముండకి పేరు మంచిదే. అనుకుని "సరేలే వెళ్ళి ఆ పన్జూడు."

పాపమ్మ వెళ్ళిపోయింది. జరిగిందంతా నాటకీయంగా అనిపించింది ఆమెకు. తాను ముష్టి కోసం రావటమేవిటి. ఆ ఇల్లాలు తిట్టడమేవిటి, అందుకు తాను పనిమ్మని అడగటమేవిటి, ఆమె మారు మాట్లాడకుండా పన్లో పెట్టుకోవటమేవిటి? అంతా ఆశ్చర్యంగా వుంది.

పనెక్కువగా ఉన్నా ప్రాణం సుఖంగా ఉంది పాపమ్మకు. ఆకలి తీర్చుకుందుకు ఇంటింటికీ తిరిగి దేబిరించనక్కర్లేదు. కడుపు నిండా కాకపోయినా ఆకలి ఎరగనంతగా అన్నం దొరుకుతోంది. సుఖంగా నిద్రపోవడానికి నీడ దొరికింది. ఒంటిని పూర్తిగా కప్పుకోడానికి పాతవైనా మంచి గుడ్డలు దొరికాయి. అంతకంటే ఆ ప్రాణికి మరేం కావాలి?

పాపమ్మ తెల్లగా, మంచి వడ్డూ పొడుగూ కలిగి అందంగానే ఉంటుంది. రోజూ స్నానం లేక, శుభ్రమైన బట్టలు లేక అనాకారిగా కనిపించినా, ఇప్పుడు స్నానం చేసి, మంచి గుడ్డలు కట్టుకుందేమో, అప్సరసలా కాకపోయినా అందంగానే అవుపిస్తోంది. అప్పటికి అదొక్కటే వరాలమ్మకి అయిష్టం అయిన విషయం. ఆ విషయంలో పరి పరి విధాల ఆలోచించి చూసింది కూడాను. లాభనష్టాలు బేరీజు వేసి చూసుకుంది. ఆమె పడే బాధల ముందు అదేమంత పెద్ద నష్టంగా ఆమెకు అవుపించలేదు. చివరకు ఫర్వాలేదు లెమ్మని సరిపెట్టుకుంది.

పాపం! ఆమె అవసరం అలాంటిది. ఆ రోజంతా ఖుషీగా, మనిషి నలక్కుండా కనిపించడంతో వరాలమ్మ భర్తకి అనుమానం వచ్చింది.

"ఏవిటే అప్పుడే విచ్చుకుంటోన్న మొగ్గలా మెరిసిపోతున్నావ్? పని మనిషి వచ్చిందా, ఏవిటి?" అనడిగాడు.

వరాలమ్మ గాలిలో తేలిపోయింది. భర్త మెచ్చుకున్నందుకు కాదు. ఉదయం వేడి చల్లారి భర్త మూడ్‌లో పడ్డందుకు.

"తెల్లారి లేచినప్పట్నుంచీ రెక్కలు ముక్కలు చేసుకుంటే ఎలా ఉంటుందో, తీరిగ్గా కూర్చుని మీరింటికి వచ్చేటప్పటికి తయారై వుంటే ఎలా ఉంటుందో తెలిసిందా?" అని తిరిగి ప్రశ్న వేసింది.

"నేను కాదన్నానా? ఇంతకీ ఏవిటికథ?"

"కొత్త పనిమనిషిని పెట్టుకున్నాను" అంది ఖుషీగా.

కొత్త మనిషి అంటే ఏదో పన్జేసి వెళ్ళిపోయేది అనుకున్నాడు ఆ పెద్ద మనిషి. కాని ఆ మనిషి ఇంట్లోనే ఉండేది అని తెలుసుకున్నాక, ఆమె అందాన్నీ వయస్సునీ చూశాక మనసులోనే ఎగిరి గంతేశాడు.

రోజా లేడికి లేచిందే పరుగన్నట్లు, నిద్ర లేవగానే ఆఫీసుకు పరుగెత్తుకుపోయే భర్త ఆ రోజు ఎంతకీ కదలకపోవడం చూసి "ఏవిటండీ ఇవాళ ఇంత తీరిగ్గా ఇంట్లో కూర్చున్నారు?" అనడిగింది.

"ఏముందీ, నిన్ను చూస్తూ కాసేపు ఇంట్లోఉండబుద్దేసింది" అని జోక్‌గా మార్చేశాడు.

"చాల్లెండి, చిన్నా చితికా మీరు. పెళ్ళి కెదిగిన కొడుకు ఇంట్లో ఉన్నాడు."

"అవును. పనీ పాటా కూడా లేకుండా."

"ఎప్పుడూ వాణ్ణి అడిపోసుకుంటారు. వాడికేం వయసు మించిపోతోందా ఏవిటండీ, ఇవాళ కాకపోతే రేపు చూసుకుంటాడు ఉద్యోగం."

"ఆఁ.... అలాగే, ఇంకో రెండేళ్లాగితే ప్రభుత్వోద్యోగానికి పనికిరాకుండా పోతాడు. అప్పుడు తెలుస్తుంది. వాడి వయస్సేవిటో."

ఇంతలో పాపమ్మ అక్కడి కొచ్చి - "అమ్మగారూ! పనైపోయిందండీ" అంది.

అయ్యగారి కళ్ళు ఆమె మీదనే ఉండిపోవటంతో వరాలమ్మ కొంచెం ఆందోళన పడింది.

"ఎవరే ఈ పిల్ల?" అనడిగాడు తెలీనట్లు.

"ఇదేనండీ కొత్తగా పెట్టుకున్న పనిపిల్ల."

"అలాగా, ఎంతకాలానికి నీకీ మంచి బుద్ధి పుట్టిందే..."

"అంటే?"

"అబ్బే, ఏం లేదుగాని, కాస్త టిఫిన్ పారెయ్యి తినేసి ఆఫీసుకు పోతాను."

పాపమ్మ ఇంకా అక్కడే నిలబడి ఉంది.

"ఎందుకే ఇంకా ఇక్కడే నిలబడ్డావ్? నేనొస్తాలే బయటకు నడు" అని సాగనంపి భర్తకు ఫలహారంవడ్డించే పన్లో పడింది. కాని ఆమె మనసు మాత్రం మనసులో లేదు.

భర్త అలా వెళ్ళగానే ముద్దుల కొడుకు ఇలా ఇంట్లో ప్రవేశించాడు.

"ఎవరే అమ్మా! ఆ దొడ్లో ఉన్న పిల్ల" అనడిగాడు.

కథంతా కొడుక్కి చెప్పింది.

"అందుకా స్టోర్ రూం అంత కళకళ లాడుతోంది" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా ఎలాగో గడిచింది. వరాలమ్మకి. అసలామెకు నిద్ర పట్టి ఉండేది కాదు. అయితే ఆమె బి.పి పేషెంటు. నిద్రమాత్రలు వేసుకుతీరాలి. ఆ రోజు మరో మాత్ర ఎక్కువగా మింగి మరీ పడుకుంది. రోజు కంటే కొంచెం ఆలస్యంగానే లేచింది కూడాను. అందుకు కారణం నిద్ర మాత్రల వల్ల వచ్చిన బద్దకం కొంతా, పని పిల్ల ఉందనే భరోసా కొంతాను. కాని తీరా లేచి చూసేటప్పటికి ఎక్కడివక్కడే పడున్నాయి. మరుక్షణం అశోకవనంలోసీతమ్మ వారిలాగ పాపమ్మ వచ్చి ఆమె ముందు నిలబడింది.

"ఏమే పనులన్నీ అలాగే ఉండిపోయాయి?" అనడిగింది.

"నేనింక ఇక్కడ ఒక్క చణం కూడా ఉండను." అంది

"ఏం... ఏమైంది?"

"ఇది సంసారుల ఇల్లా, సాని కొంపా?"

"అదేవిటే నోటికొచ్చినట్టు వాగుతున్నావ్?"

"లేకపోతే ఏంటమ్మా. ఇన్నేళ్ళ నుంచీ ఈదిలో తొంగుంటున్నాను. ఏ మొగోడూ నామీద చెయ్యేసిన పాపాన్న పోలేదు. రెండ్రాత్రులు ఈ ఇంట్లో తొంగున్నానో లేదో నీ మొగుడూ, కొడుకూ ఏపుకు తింటున్నారు."

ఆ తరువాత మరేమీ వినిపించలేదు వరాలమ్మకి. "వెళ్ళిపో... వెళ్ళిపో... వెంటనే వెళ్ళిపో..." అంది.

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 18-7-1990)*